సాక్షి శ్రీకాకుళం

మంగళవారం ၊ 16 ၊ ఏప్రిల్ ၊ 2024



గల్ఫ్ వెళ్లేందుకు బయల్దేరి..

గల్ఫ్ వెళ్లేందుకు బయల్దేరిన ఉద్దానం యువకుడు ముంబైలో చనిపోయాడు. కుటుంబానికి సమాచారం వచ్చింది. - 8లో



గొప్పలు. డప్పులు.. తిప్పలు

చంద్రబాబు పలాస పర్యటన డప్పు కొట్టుకోవడానికే సరిపోయింది. జనం కూడా ఆసక్తి చూపలేదు. - 8లో

ఆధార్ సేవలు పునరుద్ధరణ

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రధాన తపాలా కార్యాలయంలో ఆధార్ సేవలు పునరుద్ధరించినట్లు తపాలాశాఖ అధికారి వండాన హరిబాబు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీరామమందిరం అయోధ్య ఫిలాట్లీ కార్డు రూ.100, రూ.500 కార్డులు కూడా శ్రీకాకుళంలోని ప్రధాన తపాలా కార్యాలయంలో లభిస్తాయని తెలిపారు. అదేవిధంగా మహిళా సమ్మాన్ అకౌంట్ మహిళలకు ప్రత్యేకంగా ఖాతాలు తెరుస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సేవలను మహిళలు వినియోగించుకోవాలని హరిబాబు కోరారు.

న్యూస్‌రీల్

మిగులు సీట్లకు కౌన్సెలింగ్

శ్రీకాకుళం పాతబస్టాండ్: అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతిలో మిగులు సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని, మెరిట్ లిస్టులో ఉన్న వారు హాజరు కావాలని అంబేద్కర్ గురుకుల విద్యాలయాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ, జిల్లా కోఆర్డినేటర్ ఎస్.బాలాజీ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది 5వ తరగతి ప్రవేశ పరీక్ష రాసి ఎంపికైన విద్యార్థులకు మొదటి లిస్టులో సీట్లు కేటాయించగా మిగిలిపోయిన సీట్లకు ఈ నెల 18న బాలురకు దుప్పలవలస డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో, 19న బాలికలకు పెద్దపాడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఉదయం 10 గంటల నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంట్రన్స్ పరీక్ష రాయని విద్యార్థులకు సీట్లు ఉండవని స్పష్టం చేశారు. సమాచారం కోసం బాలురు 9440887830, 7569788629 నంబర్లకు, బాలికలు 7093345619, 9000314209 నంబర్లను సంప్రదించాలని ఆయన తెలిపారు.

'చార్జిషీట్ త్వరగా ఫైల్ చేయండి'



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: పలువురు ముద్దాయిల కేసుల్లో చార్జిషీట్లు త్వరితగతిన ఫైల్ చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. జిల్లా కోర్టు నుంచి వివిధ కోర్టుల అధికారులు, పోలీసులతో ఆయన సోమవారం వీడియో కాన్ఫరెన్స్ హాల్లో అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ మీటింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

'దివ్యాంగ ఓటర్లకు ఇబ్బంది ఉండకూడదు'

శ్రీకాకుళం పాతబస్టాండ్: విభిన్న ప్రతిభా వంతులను పోలింగ్ కేంద్రాలకు తరలించడంలో, పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అసౌకర్యం కలుగకూడదని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో విభిన్న ప్రతిభావంతులకు పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపులు, వీల్ చైర్‌ల ఏర్పాటుపై సోమవారం ఆయన రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో విభిన్న ప్రతిభావంతులైన ఓటర్లు(పీడబ్ల్యూడీ) 21,481 మంది ఉండగా, 85 ఏళ్లు దాటిన ఓటర్లు 11,485 మంది ఉన్నట్లు వివరించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. పీడబ్ల్యూడీ ఓటర్లకు కావాలంటే రవాణా సదుపాయం కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. పోలింగ్ రోజున పీడబ్ల్యూడీ ఓటర్లకు ప్రత్యేక వరుస ఉంటుందని చెప్పారు. అలాగే ఓటింగ్ ఫ్రం హోమ్‌కు సంబంధించి ఫారం–12డి పంపిణీపై సమీక్షించారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, విభిన్న ప్రతిభా వంతుల శాఖ ఏడీ కవిత, శ్రీకాకుళం ఆర్డీఓ, రిటర్నింగ్ అధికారి సీహెచ్ రంగయ్య, ఆరోగ్య శ్రీ జిల్లా కో ఆర్డినేటర్ ప్రకాశరావు, సోషల్ వెల్ఫేర్ డీడీ విశ్వమోహన్ రెడ్డి, డీఈఓ వెంకటేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్, వివిధ ఆసుపత్రుల యాజమాన్యాలు డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ సుభాషిణి నాయక్, చైతన్య, విభిన్న ప్రతిభా వంతులు, తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌కు ఏపీ మోడల్ స్కూల్ బాలికల ఎంపిక



శాయ్ స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైన వారితో ప్రిన్సిపాల్ ఎం.ఈశ్వరరావు

కవిటి: స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా(శాయ్) విశాఖపట్నం స్పోర్ట్స్ స్కూల్‌కు కవిటి మండలం రాజపురం ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన ముగ్గురు బాలికలు ఎంపికకావడం అభినందనీయమని ప్రిన్సిపాల్ ఎం.ఈశ్వరరావు అన్నారు. సోమవారం ఈ మేరకు ఈ పాఠశాలలో ప్రవేశాలకు ఎంపికైన బాలికలను ఆయన అభినందించారు. ఎంపికైన వారిలో కప్ప అనూష, అంబటి సాయి, బాకీ వర్షిణి ఉన్నారు. వీరంతా వాలీబాల్ క్రీడకు సంబంధించి ఈ ఏడాది ఫిబ్రవరి 12,13 తేదీల్లో జరిగిన సెలెక్షన్లలో చూపిన ప్రతిభ ఆధారంగా ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయుడు నేతాజీ తెలిపారు.



టెక్కలి.. అభివృద్ధి లోగిలి



ప్రగతికి స'పోర్టు'

పోర్టు పేరిట రాజకీయ పార్టీలన్నీ ఓట్లు దండుకున్నాయే తప్ప నిర్మించే ఆలోచన చేయలేదు. వైఎస్ జగన్ సీఎం అయ్యాక ఈ పనులన్నీ చకచకా ముందుకు తీసుకెళ్లారు. సుమారు రూ.4,361.91 కోట్లతో పోర్టు నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ఇటీవల కీలకమైన డ్రెడ్జింగ్ పనులు సైతం చేపట్టారు. మూలపేట, విష్ణుచక్రం గ్రామాల నిర్వాసితులకు నౌపడలో రూ.11 కోట్లతో 55 ఎకరాల్లో పునరావాస కాలనీ నిర్మాణ పనులు చేపడుతున్నారు.

ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న పోర్టు నిర్మాణం వైఎస్ జగన్ సర్కారుతో సాధ్యమైంది. ఎవరు వస్తారా అని ఎదురు చూస్తున్న టెక్కలి ఆస్పత్రికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జీవం పోసింది. 14 ఏళ్ల పాలనలో టీడీపీ నాయకులు చేయలేని పనులను ఐదేళ్ల కాలంలో ఈ ప్రభుత్వం చేసి చూపించింది. తిత్లీ పరిహారం అందని అర్హులకు న్యాయం చేసింది. సొంతిల్లు లేని వారికి పట్టాలిచ్చి సాయం చేసింది. సమగ్ర సంక్షేమ కార్యాలతో టెక్కలిని అభివృద్ధి లోగిలిగా మార్చింది.



టెక్కలి నియోజకవర్గం సంతబొమ్మాళి మండలం మూలపేట పోర్టుకు శంకుస్థాపన చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)



- 70 ఏళ్ల పోర్టు కలను సాకారం చేసిన వైఎస్ జగన్ సర్కారు
- రూ.4361.91 కోట్లతో శరవేగంగా మూలపేట పోర్టు నిర్మాణం
- టెక్కలి ఆస్పత్రి ఆధునికీకరణ
- సంక్షేమ పథకాల ద్వారా రూ.1555.84 కోట్ల మేర లబ్ధి
- రూ.6వేల కోట్లతో ప్రగతి పనులు

టెక్కలి:

టెక్కలి మారింది. శ్రీకాకుళం భవితకు దిశానిర్దేశం చేయగల స్థాయికి ఎదుగుతోంది. టెక్కలి నియోజకవర్గంలో పోర్టు నిర్మాణం సుమారు 70 ఏళ్ల నాటి కల. అలాంటి కలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారు. సుమారు రూ.4361.91 కోట్లతో సంతబొమ్మాళి మండలం మూలపేటలో గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. టెక్కలిలో గత టీడీపీ హయాంలో కాసుల కక్కుర్తితో 200 పడకల ఆస్పత్రి నిర్మాణాన్ని అసంపూర్తిగా వదిలేశారు. ఆ ఆస్పత్రిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూర్తి చేసి ప్రజలకు అంకితమిచ్చింది. టెక్కలి, కోటబొమ్మాళి, నందిగాం, సంతబొమ్మాళి మండలాల్లో సంక్షేమ పథకాల రూపంలో సుమారు రూ.1555.84 కోట్లను అర్హులకు అందజేశారు. రూ.7వేల కోట్లతో అభివృద్ధి పనులు చేశారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ వైఎస్సార్‌సీపీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉన్నారు.



- టెక్కలిలో రూ.84 లక్షలతో వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు.

నెరవేరిన సొంతింటి కల

నియోజకవర్గంలో దాదాపు 6875 మందికి రూ. 98.93 కోట్ల రూపాయలు వెచ్చించి ఇళ్ల స్థలాలు అందజేశారు. చాలా వరకు ఇళ్ల నిర్మాణాలు కూడా పూర్తయ్యాయి.

విద్యాలయాలకు ఊతం

నాడు–నేడు పనుల్లో రూ.20.89 కోట్లతో ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలను అభివృద్ధి చేశారు. అచ్చెన్నాయుడు సొంత గ్రామంలో సుమారు కోటిన్నర ఖర్చుతో ప్రభుత్వ పాఠశాలలను బాగు చేశారు. మరో రూ.3కోట్లతో ప్రభుత్వ జూనియర్ కాలేజీని అభివృద్ధి చేశారు.

గ్రామ స్వరాజ్యానికి..

గ్రామస్థాయి పాలనను సాకారం చేయడానికి 89 సచివాలయాలు, 89 రైతు భరోసా కేంద్రాలు 72 వెల్‌నెస్ కేంద్రాలు నిర్మించారు. దీనికి సుమారు రూ.67 కోట్లు వెచ్చించారు.



- టెక్కలి డివిజన్‌లో ఎక్కడా లేని విధంగా నందిగాం మండలం కర్లపూడిలో రూ.16లక్షల 50వేలతో డిజిటల్ లైబ్రరీని ప్రభుత్వం నిర్మించింది.



వినూత్నం.. విత్తనోత్పత్తి కేంద్రం

రైతులకు మేలు చేసేలా నందిగాం మండలం బడబంద గ్రామం వద్ద సుమారు రూ.4 కోట్ల 70 లక్షలతో విత్తనోత్పత్తి కేంద్రాన్ని మంజూరు చేశారు. జిల్లాలోని 45వేల మంది రైతులకు మేలు చేసేలా 15వేల క్వింటాళ్ల నిల్వ సామర్థ్యం కలిగిన కేంద్రం నిర్మించారు.



- టెక్కలి మండలం శివారు గ్రామాలైన పెద్దరోక్కళ్లపల్లి వద్ద నిర్మాణం చేసిన మంచి నీటి పథకం.



అర్హులకు పరిహారం

తిత్లీ తుఫాన్ వచ్చి సర్వస్వాన్నీ తుడిచిపెట్టేసింది. కానీ టీడీపీ నాయకులు తమ వారికి మాత్రమే పరిహారం అందజేశారు. వైఎస్సార్‌సీపీ వచ్చాక అర్హులకు రూ. 40 కోట్ల పరిహారాన్ని ఇచ్చి న్యాయం చేసింది.

నెరవేరిన స్వప్నాలు..

- నందిగాం మండలం నుంచి పూండీ వెళ్లేందుకు వీలుగా నరేంద్రపురం పంచాయతీ నారాయణపురం వద్ద వంశధార ప్రధాన కాలువపై వంతెన ఏర్పాటుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.1.58 కోట్లు మంజూరు చేసింది. దీంతో రెండు మండలాల మధ్య రాకపోకలకు మార్గం దొరికింది.
- కోటబొమ్మాళి మండలంలో సుమారు రూ. 50కోట్లతో రోడ్లు, కాలువలు నిర్మించారు.
- దంత జంక్షన్‌లో బ్రిడ్జి నిర్మాణం, సీసీ రోడ్లు, కాలువ నిర్మాణం వంటి పనులెన్నో చేశారు.
- టెక్కలి మండలం తలగాం, పెద్దరోక్కళ్లపల్లి, ముఖలింగాపురం పంచాయతీలో గిరిజన గ్రామాలకు తారు రోడ్లు వేశారు.

చేసి చూపించాం..



టెక్కలి నియోజకవర్గంలో కింజరాపు కుటుంబం కేవలం స్వార్థపూరితమైన రాజకీయాలకు పాల్పడుతూ అభివృద్ధిని పక్కన పెట్టేసింది. ప్రతి ఎన్నికల్లో నీటి మూటల హామీలతో అధికారాన్ని దక్కించుకున్నారు. దశాబ్దాల కాలంలో వారికి సాధ్యం కాని అభివృద్ధి పనులను ఈ ఐదేళ్లలో చేసి చూపించాం. ఈ నియోజకవర్గంలో 70 ఏళ్లుగా కలగా మిగిలిపోయిన పోర్టును సాకారం చేశాం. మరికొద్ది రోజుల్లో టెక్కలి నియోజకవర్గం దేశ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు సంతరించుకోనుంది. వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభించే సమయం ఆసన్నమైంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి శ్రీకారం చుట్టిన ఆఫ్‌షోర్‌ను పూర్తి చేయడానికి నిధులు కేటాయించారు. ముఖ్యంగా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా వదిలేసిన టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూర్తి చేసి ప్రజలకు అంకితం చేసింది.

– దువ్వాడ శ్రీనివాస్, ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, టెక్కలి నియోజకవర్గం

వైఎస్సార్‌సీపీ హయాంలో లబ్ధి (కొన్ని పథకాలు)

పథకం	లబ్ధిదారులు	లబ్ధి మొత్తం (రూ. కోట్లలో)
వైఎస్సార్ చేయూత	29,545	139.70
వైఎస్సార్ ఆసరా	68,121	172.32
జగనన్న అమ్మఒడి	29,773	1.42
అర్చకులు	122	5.97
జగనన్న చేదోడు	2,590	4.68
కోవిడ్ సాయం	63,527	8.15
క్రాప్ ఇన్సురెన్స్	13,639	20.95
హౌసింగ్ డీబీటీ	6,195	7.89
ఇన్‌పుట్ సబ్సిడీ	5453	18.49
జగనన్న వసతి	15,928	21.85
జగనన్న విద్యా దీవెన	17,750	35.80
వైఎస్సార్ పెన్షన్ కానుక	53,314	427
వైఎస్సార్ రైతు భరోసా	53,035	168.89
వైఎస్సార్ సున్నావడ్డీ	22,075	7.53
ఎస్‌హెచ్‌జీ సున్నావడ్డీ	61,660	13.95
వైఎస్సార్ వాహనమిత్ర	2,390	7.83
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	6,889	4.48
వైఎస్సార్ బీమా	795	11.23
వైఎస్సార్ కల్యాణమస్తు	365	4.48
వైఎస్సార్ మత్స్యకార భరోసా	3,960	13.94
వైఎస్సార్ కాపునేస్తం	701	2.19
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	199	7.01
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	8,417	38.65



వైఎస్సార్‌సీపీ హయాంలో పూర్తి స్థాయి నిర్మాణంతో ప్రజలకు అంకితం చేసిన టెక్కలి లో 200 పడకల జిల్లా ఆస్పత్రి

- మండలంలో లింగాలవలస పంచాయతీలో శివారు గ్రామాలతో పాటు గిరిజనులకు వైద్యం అందుబాటులో తీసుకురావాలనే 30 ఏళ్ల నాటి కలను సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం నెరవేర్చింది. సుమారు రూ. 2 కోట్ల 30 లక్షలతో కొత్తగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం తలపెట్టారు.
- నందిగాం మండలం కొండల ప్రాంతంలోని 8 సచివాలయాల పరిధిలోని 23 గిరిజన గ్రామాలకు వైద్య సదుపాయం అందించేందుకు వీలుగా నౌగాంలో రూ.కోటీ 85 లక్షలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించింది.



ఇంకా అందని పిలుపు
ఫలించేనా ఎదురుచూపు!




- శ్రీకాకుళం, పాతపట్నం టీడీపీలో నేడు స్పష్టత వచ్చే అవకాశం
- చంద్రబాబు పిలిపిస్తారని ఆశ
- మొండి పట్టుతో ఉన్న కలమట
- తేల్చుకోలేకపోతున్న గుండ లక్ష్మీ దంపతులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

అధినేత కరుణించడం లేదు. టికెట్ ఆశించి భంగపడ్డ ఆశావహులకు ఎదురు చూపులు తప్పడం లేదు. మధ్యలో వెనకున్న కేడర్ సందిగ్ధంలో పడింది. ప్రలోభాలకు ఆకర్షితులైన వారు దారి చూసుకుంటున్నారు. శ్రీకాకుళం, పాతపట్నం టీడీపీలో ఇప్పుడిదే కనిపిస్తోంది. టీడీపీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారని ఇంతవరకు వేచి చూశారు. నాలుగైదు రోజుల్లో ఏదో ఒకటి తేల్చుతామని చెప్పి పది, పదిహేను రోజులవుతున్నా క్లారిటీ ఇవ్వలేదు. చివరికి జిల్లాకొచ్చినా ఏమీ తేల్చలేదు. కనీసం కలవమని కబురు లేదు. మంగళవారం వరకు జిల్లాలోనే ఉంటారు. ఈలోగా పిలుపు వస్తుందేమోనని ఎదురు చూస్తున్నారు. రాకపోతే భంగపడ్డ ఆశావహులు ఏదో ఒక నిర్ణయం తీసుకోక తప్పదు.

టికెట్ దక్కలేదని ఆగ్రహంతో ఉన్న సమయంలో శ్రీకాకుళం మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణలను హైదరాబాద్ పిలిపించుకుని చంద్రబాబు మాట్లాడారు. కొన్ని రోజులు ఆగితే న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో అప్పటికే ప్రకటించిన అభ్యర్థుల్లో మార్పు ఉంటుందని, వారి స్థానంలో తమను ఖరారు చేస్తారని భావించారు. కానీ, చంద్రబాబు రోజులు దాట వేస్తున్నారే తప్ప చేస్తానన్న న్యాయమేంటో చేయడం లేదు. ఇదిగో అదిగో అని తాత్సారం చేస్తున్నారు. ఈ క్రమంలో కలమట వెంకటరమణ కాస్త మొండిగానే ఉన్నారు. తన అనుయాయులతో నియోజకవర్గంలో ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానంటూ కార్యక్రమాలు చేసుకుని వెళ్తున్నారు. ఎప్పటికప్పుడు అధిష్టానానికి వార్నింగ్ ఇచ్చేలా ర్యాలీలు, సభలు నిర్వహిస్తున్నారు. తన బలమేంటో చూపిస్తున్నారు. శ్రీకాకుళం విషయం వచ్చేసరికి గుండ లక్ష్మీ దంపతులు ఇంకా వేచి చూసే ధోరణిలో ఉన్నారు. గొండు శంకర్‌కు టికెట్ ఖరారు చేసిన తొలి రోజుల్లో హడావుడి చేసినా ఆ తర్వాత సైలెంట్‌గా ఉండిపోయారు. అధిష్టానంపై తనకు నమ్మకం ఉందని, తప్పకుండా అభ్యర్థిని మార్చుతారని ధీమాతో ఉండిపోయారు. హైదరాబాద్‌లో చంద్రబాబును కలిసినప్పుడు నాలుగు రోజుల్లో న్యాయం చేస్తానని హామీ ఇచ్చినా ఇప్పటికే పది, పదిహేను రోజులవుతున్నా అతీగతి లేదు. ఇంట్లో కూర్చొని వేచి చూడడం తప్ప ఇంకేం చేయడం లేదు. ఈ లోపు గొండు శంకర్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ, ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు డైరెక్షన్‌లో గుండ దంపతుల కేడర్‌ను తమవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇదంతా గమనించిన కేడర్‌లో కొందరు తమ దారి చూసుకుంటున్నారు.



కబురు వచ్చేనా..

సోమవారం సాయంత్రం వరకు ఆశావహులు అధినేత పిలుపు కోసం ఎదురు చూశారు. కానీ వీరికి పిలుపు రాలేదు. కలమటకు మాత్రం ఎంపీ రామ్మోహన్‌నాయుడు ఫోన్ చేసి, మంగళవారం పిలుపు వచ్చే అవకాశం ఉందని, వచ్చేందుకు సిద్ధంగా ఉండాలని చెప్పినట్టు సమాచారం. గుండ లక్ష్మీదేవికి మాత్రం ఫోన్ రాలేదు. మంగళవారం వరకు చంద్రబాబు పలాసలో ఉండనుండటంతో ఈలోగా కబురు వస్తుందని చూస్తున్నారు. అప్పటికీ పిలుపు రాకపోతే వీరికి డోర్స్ క్లోజ్ అయినట్టు భావించాలి.

క్లుప్తంగా

విశ్రాంత హోంగార్డుకు చెక్కు అందజేత


చెక్కును అందజేస్తున్న ఎస్పీ జీఆర్ రాధిక

శ్రీకాకుళం క్రైమ్: సహచర హోంగార్డులు స్వతహాగా అందజేసిన ఒక్క రోజు గౌరవ వేతనం నగదు చెక్కును విశ్రాంత హోమ్‌గార్డు ఆరిక నూకయ్యకు ఎస్పీ జీఆర్ రాధిక సోమవారం అందజేశారు. జిల్లా హోమ్‌గార్డు యూనిట్‌లో నూకయ్య పనిచేసి గతనెలలో పదవీ విరమణ పొందారు. ఈ మేరకు ఒక రోజు గౌరవ వేతనం రూ.4.21 లక్షల చెక్కును ఎస్పీ జిల్లా కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ కె.నర్సింగరావు, ఇన్‌చార్జి హెడ్‌కానిస్టేబుల్ రాజు తదితరులున్నారు.

గల్ఫ్ వెళ్లేందుకు బయల్దేరి..


నీలాపు గణేశ్ (ఫైల్)

ఇచ్ఛాపురం రూరల్: గల్ఫ్ వెళ్లి వస్తానంటూ స్నేహితులు, కుటుంబ సభ్యులకు చెప్పి ఇంటి నుంచి వెళ్లిన యువకుడు విగతజీవిగా మారాడు. మండలంలోని కేదారిపురం గ్రామానికి చెందిన నీలాపు కామరాజు, తరిణమ్మల రెండో కుమారుడు నీలాపు గణేశ్(23) ముంబైలో అనుమానాస్పదరీతిలో మృతి చెందాడు. గణేశ్ తండ్రి కామరాజు ఏడాదిన్నర క్రితం అనారోగ్యంతో మృతి చెందగా, తల్లి, అన్నయ్య దుర్యోధన, చెల్లెలు లావణ్యతో కలసి ఇంటి వద్దనే ఉంటున్నాడు. వెల్డర్‌గా శిక్షణ పొందిన గణేష్ దుబాయ్ వెళ్తానంటూ గత నెల 16న ముంబై వెళ్లాడు. వీసా రావడం ఆలస్యం కావడంతో ముంబైకి సమీపంలోని ఎగత్‌పూర్‌లో ఉంటున్నాడు. అక్కడ ఏమైందో ఏమో గానీ గణేష్ శనివారం రాత్రి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి ఫోన్, ఆధార్ కార్డులను స్వాధీనం చేసుకున్న ఎగత్ పూర్ జీఆర్పీ పోలీసులు ఆదివారం రాత్రి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. అందరితో కలివిడిగా ఉన్న వ్యక్తి విగతజీవిగా మారడంపై గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

జగన్‌పై దాడి కూటమి నాయకుల పనే

- వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శిమ్మ రాజశేఖర్


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న శిమ్మ రాజశేఖర్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి వస్తున్న ఆదరణ చూడలేక కూటమి నాయకులే ఆయనపై దాడికి పాల్పడ్డారని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి శిమ్మ రాజశేఖర్ ఆరోపించారు. దేశ ప్రధాని సైతం దాడిపై స్పందించారని, కానీ టీడీపీ నాయకులు ఇంకా తప్పుడు ప్రచారాలు చేయడం సరికాదని అన్నారు. శ్రీకాకుళం నగరంలోని టౌన్‌హాల్ వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడారు. మామ ఎన్టీ రామారావు, బీజేపీ నాయకుడు అమిత్‌షాలపై రాళ్లతో దాడి చేయించిన చరిత్ర చంద్రబాబుదేనని అన్నారు. ఒక్క రోజు ప్రచారంలో పాల్గొని జ్వరం తెచ్చుకుని వెళ్లిపోయిన పవన్ వైఎస్ జగన్ గురించి మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. దెబ్బతగిలినా లెక్క చేయకుండా వైఎస్‌జగన్ మేమంతా సిద్ధం బస్సుయాత్ర నిర్వహించారని గుర్తు చేశారు. ఈ కూటమి నాయకులు ప్రజాక్షేత్రంలో గెలవలేరని అన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ రుషి, సుంకరి కృష్ణ, పసగాడ రామ్మృష్ణ, డీఎస్‌కే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

364 మద్యం బాటిళ్ల పట్టివేత

గార: మండల పరిధి చల్లపేట గ్రామంలో 364 మద్యం బాటిళ్లతో ఉన్న ఓ వ్యక్తిని సోమవారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్), ఇంటిలిజెన్సు వింగ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శ్రీకాకుళం సెబ్ సీఐ ఎంవీ గోపాలకృష్ణ తెలిపిన వివరాల మేరకు చల్లపేట గ్రామానికి చెందిన బాకి అమర్‌నాథ్ 364 హార్డ్ డిజైర్స్ ఆల్ట్రా డీలక్స్ విస్కీ బాటిళ్లను రెండు మూటలతో పట్టుకెళ్తున్నట్లు సమాచారం రావడంతో జిల్లా సెబ్ అదనపు ఎస్పీ (జాయింట్ డైరెక్టర్) డి.గంగాధరం వెంటనే అధికారులకు ఆదేశాలు జారీచేశారు. సీఐ ఎంవీ గోపాలకృష్ణ, ఇంటెలిజెన్సు సీఐ కూర్మారావులు తమ సిబ్బందితో కలిసి చల్లపేట వద్ద మాటు వేయగా మద్యం మూటలతో ఉన్న అమర్‌నాథ్ అదే గ్రామానికి చెందిన సిమ్మ జగన్నాథం ఇంటి పరిసర ప్రాంతంలో ఉన్న రేకు షెడ్డులో ఒక మూట పెట్టేసి మళ్లీ మరో మూటను పెట్టేందుకు యత్నిస్తుండగా పట్టుకున్నారు. బాటిళ్లను సీజ్ చేసి అతడిని అదుపులోకి తీసుకున్నారు.

ప్రచార వైభవం


శ్రీకాకుళం హడ్కో కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు


వజ్రపుకొత్తూరు: కొండవూరులో ప్రచార రథంపై నుంచి మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు


పొందూరు: స్పీకర్ తమ్మినేని సీతారాంతో ఆత్మీయంగా మాట్లాడుతున్న వృద్ధుడు


సోంపేట: వృద్ధురాలితో కలిసి చిందులేస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ


జలుమూరు: లింగాలవలసలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ధర్మాన కృష్ణదాస్

ప్రచార రథాలు ఊరూరా తిరుగుతున్నాయి. నేతల ప్రసంగాలు పల్లెపల్లెనా ప్రతిధ్వనిస్తున్నాయి. పార్టీ పతాకాలు ఊరూరా ఎగురుతున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ప్రచార పర్వాలు మరింత రాటుదేలుతున్నాయి.


నందిగాం: ప్రచార రథంపై ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్


మెళియాపుట్టి మండల కేంద్రంలో ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

చంద్రబాబు ప్రోద్బలంతోనే సీఎంపై దాడి

- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు


మాట్లాడుతున్న డాక్టర్ సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: చంద్రబాబు ప్రోద్బలంతోనే సీఎం వైఎస్ జగన్‌పై దాడి జరిగిందని మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. ఆయన సోమవారం పలాసలో విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు హుందాగా రాజకీయాలు చేయాలని సూచించారు. గౌతు కుటుంబ పాలనలో చంద్రబాబు పాలనలో పలాస ఎలా ఉండేదో ఇప్పుడు జగనన్న పాలనలో పలాస ఎంత అభివృద్ధి చెందిందో చూడాలని కోరారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2018లో ఒక పుస్తకాన్ని ఆవిష్కరించారని, అందులో రాష్ట్రంలోని 13 జిల్లాల స్థితిగతులు వివరించారని, ఆ పుస్తకంలో 12, 13వ స్థానాల్లో శ్రీకాకుళం జిల్లా, విజయనగరం ఉండేవని, ఆయన పాలనలో ఉత్తరాంధ్ర వెనుకబడి ఉందని చెప్పడానికి ఇంతకంటే ఉదాహరణ ఇంకేం ఉంటుందని అన్నారు. ఉత్తరాంధ్రకు చంద్రబాబు చేసిన మంచి ఏమిటో చెప్పాలని సూటిగా ప్రశ్నించారు. ఇక్కడి ప్రజలు వలస వెళ్లకుండా ఏం చేశారో చెప్పాలన్నారు. జగనన్న పాదయాత్ర చేసి ఇక్కడి వారి గుండె చప్పుడు విన్నారని, ఆ సంకల్పంతోనే విశాఖలో ఎగ్జిక్యూటివ్ రాజధాని పెట్టాలని నిర్ణయించుకున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు అమరావతి పేరిట ఒక రియల్ ఎస్టేట్ లేఅవుట్ ఏర్పాటు చేశారని విమర్శించారు. అమరావతి ల్యాండ్ పూలింగ్ విధానంలో 50 వేల ఎకరాలు పూర్తిగా రియల్ ఎస్టేట్ చేయడం చంద్రబాబు చేసిన పెద్ద మోసమని అన్నారు. విశాఖపట్నంలో అన్ని రకాల వసతులు ఉన్నా చంద్రబాబు ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించారు. కూడు, గూడు, గుడ్డ కోసం ఉత్తరాంధ్ర ప్రజలు పోరాటాలు చేశారని తెలిపారు. ఇప్పుడు ఇక్కడకు రాజధాని వస్తుంటే చంద్రబాబు అడ్డు పడుతున్నారని, జనం ఈ విషయాన్ని గమనించాలని కోరారు. విశాఖ రాజధానితో పాటు భోగాపురంలో ఎయిర్‌పోర్టు కడుతున్నారని తెలిపారు. చంద్రబాబు హయాంలో ఏ నిర్మాణమైనా జరిగిందా అని ప్రశ్నించారు. జిల్లాలో మూలపేట పోర్టు నిర్మాణం శరవేగంగా జరుగుతోందన్నారు. భోగాపురంలో ఎయిర్ పోర్ట్, మూలపేటలో పోర్ట్, విశాఖపట్నం ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌గా ఇలా చెప్పుకుంటూ పోతే చాలా పనులు చేపడుతున్నామని తెలిపారు. చంద్రబాబు మాట్లాడితే కియా తెచ్చాను అంటారని కియా కంపెనీ రూ.2 వేల కోట్లతో పెట్టుబడి మాత్రమేనని, కానీ జగనన్న ప్రభుత్వంలో ఒక్క గ్రీన్ కో ఎనర్జీ రూ.23 వేల కోట్లపైన పెట్టుబడులు తీసుకువచ్చామని తెలిపారు. శ్రీ సిమెంట్ రూ 2500 కోట్లు పెట్టుబడి పెట్టారని చెప్పారు. రాష్ట్రంలో నాలుగు పోర్టులు నిర్మాణంలో ఉన్నాయన్నారు. బల్క్ డ్రగ్ పార్క్ నక్కపల్లి దగ్గర రూ.2500కోట్లతో నిర్మిస్తున్నామని చెప్పారు. చంద్రబాబు మూలపేట పోర్టు వద్దకు వెళ్లి సెల్ఫీ దిగాలని సవాల్ విసిరారు. తిత్లీ పరిహారాన్ని సొంత పార్టీ నాయకులకు చంద్రబాబు ఇచ్చారని, ఇప్పుడు ఉద్దానాన్ని పునర్నిర్మాణం చేసుకున్నామని చెప్పారు. పార్టీలకు అతీతంగా పరిహారాలు అందించామన్నారు. అరవై ఏళ్ల గౌతు కుటుంబ పాలనలో పలాస ఎలా ఉండేదో, ఇప్పుడు ఎలా ఉందో చూడాలన్నారు. దీనిపై చర్చకు తాను సిద్ధమని చెప్పారు. 200 పడకల ఆసుపత్రి కట్టించామని, రూ.700 కోట్లతో మంచినీటి పథకం నిర్మించామని గుర్తు చేశారు. పలాసకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల తీసుకువచ్చామన్నారు. సీఎంపై దాడి జరగడానికి రెండు రోజుల ముందు చంద్రబాబు రెచ్చగొట్టేలా మాట్లాడారని గుర్తు చేశారు.

తాబేదార్ల కోసమే చంద్రబాబు తాపత్రయం


వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మంత్రి ధర్మాన ప్రసాదరావు

- రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): నాలుగు దశాబ్దాల అనుభవం ఉన్న చంద్రబాబు చేయలేని సంక్షేమ కార్యక్రమాలు ఐదేళ్ల పాలనలో సీఎం వైఎస్ జగన్ చేసి చూపించారని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలో టౌన్ హాల్‌లో మంత్రి ధర్మాన సమక్షంలో 200కుటుంబాలు వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. వైఎస్సార్ సీపీ పాలన నచ్చి పార్టీలో చేరామని గూడెం, చంద్రయ్యపేట ప్రజలు చెప్పారు. వీరందరికీ మంత్రి ధర్మాన కండువాలు వేసి స్వాగతించారు. మండువేసవిలో సైతం మీ గ్రామాలకు లిఫ్ట్ ద్వారా సాగు, తాగునీరు అందిస్తామని ధర్మాన అన్నారు. చంద్రబాబు తన తాబేదారుల కోసం తప్ప ప్రజల కోసం పని చేయలేదన్నారు. వలంటీర్ వ్యవస్థ లేకపోవడం వల్ల ఎన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయో అంతా చూస్తేనే ఉన్నారని అన్నారు. ఉపాధి హామీ కూలీల విషయంపై ఇప్పటికే టీడీపీ నేతలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారని తెలిపారు. ప్రజలకు అందుతున్న సేవలన్నింటిపై కోర్టుకు వెళ్తూ ఆటంకం కలిగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలో ప్రధానంగా బగ్గు కోటేశ్వరరావు, సాధు అప్పలరాజు, కింజరాపు రామమూర్తి, బగ్గు శ్రీనివాసరావు, కింజరాపు రమణ, పాదిలాపు రామారావు, రావాడ జానకిరావు, రావాడ ఎండోడు, నేతిని నరసయ్య, నేతిని రమణ, మొయ్యిల రాజు, కింజరాపు వెంకటరావు, బొట్న రమేష్, బగ్గు కోటేశ్వరరావు, బగ్గు శ్రీను, బగ్గు వరలక్ష్మి, రావాడ అనురాధ, కింజరాపు రాజులమ్మ, బగ్గు డిల్లేశ్వరరావు, రామారావు, వాసుదేవరావులతో పాటు మరో 200కుటుంబాలు చేరాయి. కార్యక్రమంలో తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, ఎమ్మెల్సీ నర్తు రామారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు రూరల్ మండల అధ్యక్షుడు చిట్టి జనార్ధనరావు, గేదెల చంగళరావు, అంబటి శ్రీను, మూకళ్ల తాతబాబు, గొండు కృష్ణ, వై.శ్రీధర్, నర్తు నరేంద్రయాదవ్ పాల్గొన్నారు.

● మందుబాబులం.. మేము మందుబాబులం



పసుపు జెండాలతో మందుబాటిళ్లతో తెలుగు తమ్ముళ్లు


ఫూటుగా తాగిన తెలుగు తమ్ముడు

పలాసలో టీడీపీ నిర్వహించిన సభలో మందుబాబులు ఫూటుగా మద్యం సేవించి హల్‌చల్ చేశారు. ఓ వైపు సభ జరుగుతుంటే వీరు మాత్రం మద్యం దుకాణాల వద్ద బిజీగా కనిపించారు. - కాశీబుగ్గ

‘చంద్రబాబు అబద్ధాలకు ఆకాశమే హద్దు’


మాట్లాడుతున్న పిరియా సాయిరాజ్, పిరియా విజయ

కవిటి: ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు నాయుడు అబద్ధాలకు ఆకాశమే హద్దు అని జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ దుయ్యబట్టారు. వారు సోమవారం విలేకరులతో మాట్లాడారు. తాము 2009-10లో ఉద్దానం ఫౌండేషన్ ఏర్పాటు చేసి కిడ్నీ వ్యాధిగ్రస్తులను ఆదుకోవాలనే ఆలోచన చేశామన్నారు. అప్పట్లో పిరియా సాయిరాజ్ తన ఎమ్మెల్యే వేతనంలో కొంత మొత్తాన్ని ఓ బాధితునికి పింఛన్‌గా కూడా అందించారని పిరియా విజయ తెలిపారు. సోంపేట సీహెచ్‌సీ ఆస్పత్రికి ఓ డయాలసిస్ యంత్రాన్ని 2012లో అందించామన్నారు. బల్లిపుట్టుగ, బి.గొనపపుట్టుగ, గొండ్యాలపుట్టుగ తదితర గ్రామాల్లో పెద్దసంఖ్యలో ఆర్‌ఓ వాటర్‌ప్లాంట్లు ఏర్పాటు చేశామని, దీనిపై పత్రికల్లో వార్తలు కూడా ప్రచురితమయ్యాయని తెలిపారు. ఇవన్నీ తాము చేస్తే పలాసలో చంద్రబాబు ప్రసంగిస్తూ.. తానే ఈ ప్రాంతానికి అన్నీ చేసినట్లు డప్పు కొట్టుకోవడం హాస్యాస్పదమన్నారు. 2018లో సంభవించిన తిత్లీ తుఫాన్‌లో నష్టపోయిన రైతులకు తూతూమంత్రంగా రూ.1500 పరిహారం ప్రకటించిన చంద్రబాబు దుర్నీతిపై అప్పట్లో వైఎస్ జగన్ సమర శంఖం పూరించారని గుర్తు చేశారు. ప్రజాసంకల్ప పాదయాత్రలో ఉన్న వైఎస్ జగన్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ధర్మాన ప్రసాదరావు తదితరులతో కూడిన తన ప్రతినిధి బృందాన్ని ఉద్దానంలో పర్యటనకు పంపించారని, ఆ నివేదికల ఆధారంగా రెట్టింపు పరిహారం అందజేశారని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే పలాసలో కిడ్నీ ఆస్పత్రి నిర్మాణంతో పాటు, వాటర్ ప్రాజెక్టు నిర్మించామన్నారు. ఇవన్నీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగాయన్నది జనాలందరికీ తెలిసినా చంద్రబాబు గొప్పలు చెప్పుకోవడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు.

గొప్పలు.. డప్పులు.. తిప్పలు

- పలాసలో నిస్సారంగా సాగిన చంద్రబాబు పర్యటన
- కనిపించని కూటమి నేతలు


చంద్రబాబు మాట్లాడుతుండగా వెళ్లిపోతున్న జనం

వజ్రపుకొత్తూరు/కాశీబుగ్గ: తాను చేయని పనులను తానే చేశానని గొప్పలు చెప్పుకోవడం.. తాను తలచుకుంటే ఏదైనా చేసేస్తానని డప్పు కొట్టుకోవడం.. ప్రసంగం వినకుండా జనం వెళ్లిపోతుంటే తిప్పలు పడడం.. పలాసలో టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటన సాగిన తీరు ఇది. ప్రజాగళం పేరిట సోమవారం చంద్రబాబు పలాసలో బహిరంగ సభ నిర్వహించి మాట్లాడారు. తలా తోకలేని మాటలు మాట్లాడడంతో అప్పటికే విసిగిపోయిన మహిళలంతా తిరుగుముఖం పట్టారు. కిడ్నీ ఆస్పత్రి, వాటర్ గ్రిడ్ వంటి ప్రాజెక్టులు తన ఆలోచనలేనని చెప్పడానికి ప్రయత్నించడం కూడా పెద్దగా ఫలించలేదు. ఈలోగా సభలో మందుబాబుల హడావుడి ఎక్కువైంది. గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చని చంద్రబాబు కొత్తగా హామీల చిట్టా చదవడంతో చాలా మంది నవ్వుకున్నారు. పలాస ఇందిరాచౌక్ ఇరుకైన ప్రాంతం కావడంతో జనం ఉక్కిరిబిక్కిరయ్యారు. అనుకున్న సమయం కాకుండా ఆలస్యంగా సమావేశం జరగడంతో చాలా మంది విసుక్కున్నారు. మూడు పార్టీలతో కూడిన కూటమి సమావేశం అని చెప్పినా బీజేపీ జెండా ఒక్కటి కూడా కనిపించలేదు.

అగ్ని ప్రమాదం

సోంపేట: సోంపేట పట్టణంలోని ఎస్ఎస్ షాపింగ్ కాంప్లెక్స్‌లో సోమవారం ఉదయం అగ్నిప్రమాదం జరిగింది. రిపేర్ కోసం ఉంచిన కట్టర్లు, ఫ్యాన్‌లు కాలిపోయినట్లు అగ్నిమాపక శాఖాధికారులు తెలిపారు. వెంటనే స్పందించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అగ్ని మాపక శాఖాధికారి ఎస్.మోహనరావు, సిబ్బంది ఆర్. సింహాచలం, కేవీ రమణ, బి.బాబూరావు తదితరులు మంటలు ఆర్పారు.

యాదవులంతా ‘ధర్మాన’ వెంటే

- ఎమ్మెల్సీ నర్తు రామారావు


పెద్దపాడులో ఇంటింటికి ప్రచారంలో నర్తు రామారావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): యాదవులు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేందుకు కృషి చేసింది రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. యాదవులంటే ధర్మానకు ఎంతో అభిమానమని వైఎస్సార్ ప్రభుత్వం నుంచి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వరకు యాదవులకు చేయూతనిస్తుంది ధర్మానేనని అన్నారు. శ్రీకాకుళం నగరంలోని హయాతినగర్, పెద్దపాడులో మంత్రి ధర్మానకు మద్దతుగా ఆయన సోమవారం సమావేశాలు నిర్వహించారు. యాదవుల్ని బిసి-డి నుంచి బీసీ-బిలోకి మార్చేందుకు ధర్మాన కృషి చేస్తున్నారన్నారు. శ్రీకాకుళం నగరం, జిల్లా ధర్మానతోనే అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. టీడీపీలో యాదవులను తొక్కేశారే తప్ప అభివృద్ధి చేయలేదన్న విషయాన్ని ప్రతి ఒక్క యాదవుడు తెలుసుకోవాలన్నారు. హయాతినగర్‌లో, పెద్దపాడులో ఇంటింటికీ వెళ్లి ధర్మానకు మద్దతివ్వాలని కోరారు.

కార్యక్రమంలో యాదవ సంఘ నాయకులు నర్తు నరేంద్రయాదవ్, కడియాల ప్రకాస్, అందాల శేషగిరి, గద్దిబోయిన కృష్ణయాదవ్, గురు రవి, బూర పాపారావు, నక్క దేవానంద, కలగ పాపియాదవ్, సనగల శ్యామ్, యడ్ల వెంకటియాదవ్, పల్ల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

యువకునిపై కత్తితో దాడి


చికిత్స పొందుతున్న యువకుడు

పొందూరు: మండలంలో ని రాపాక కూడలి సమీపంలో గల మద్యం దుకాణం వద్ద ఓ యువకుడిని ఆదివారం కత్తితో పొడిచారు. ఈ సంఘటనపై ఎస్ఐ వై.రవికుమార్ తెలిపిన వి వరాల మేరకు.. పొందూ రు పంచాయతీ పరిధిలోని ఎరుకుల కాలనీకి చెందిన జి.రాము అనే యువకుడిని పొందూరు పట్టణానికి చెందిన ఎస్. ఈశ్వరరావు, వాసు, చక్రి అనే యువకులు కత్తితో పొడిచి తీవ్రంగా గాయపరిచారు. ఆదివారం రాత్రి 9.30 గంటల సమయంలో రమణ అనే వ్యక్తి మద్యం దుకాణం సమీపంలో రహదారి పక్కన గల కల్వర్టుపై కూర్చొన్నాడు. అక్కడికి మద్యం మత్తులో ద్విచక్రవాహనంపై యువకులు ఈశ్వరరావు, వాసు, చక్రిలు వచ్చి రమణను డబ్బులు అడిగారు. అతడు లేవని చెప్పడంతో ఒక్కసారిగా దాడి చేశారు. అతడి జేబులో ఉన్న డబ్బులను, సెల్‌ఫోన్‌ను లాగేసుకున్నారు. దీంతో రమణ అరవడంతో సమీపంలో ఉన్న ఆయన తమ్ముడు జి.రాము, కుటుంబ సభ్యులు పరిగెత్తుకుని వచ్చి అడ్డుకోబోయారు. దాంతో ఈశ్వరరావు తన వద్ద గల కత్తితో రామును పొత్తి కడుపులోను, ఎడమవైపు పక్కటెముకల్లో బలంగా పొడిచారు. దీంతో తీవ్రంగా గాయపడిన రామును శ్రీకాకుళం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దాడి చేసిన ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. గాయపడిన రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎస్ఐ దర్యాప్తు చేస్తున్నారు.

‘జెమ్స్’లో అరుదైన ఆపరేషన్ విజయవంతం


థైరాయిడ్‌తో ఉన్న మహిళ తొలగించిన కణితి

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళంలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో సోమవారం అరుదైన ఆపరేషన్‌ను జెమ్స్ వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారు. ఒడిశా రాష్ట్రం, రాయగడ, గువగణ ప్రాంతానికి చెందిన తడింగి అన్న అనే మహిళా కొన్నేళ్లుగా థైరాయిడ్ సమస్యతో బాధ పడుతున్నారు. తెలిసిన వారి ద్వారా ఆమె జెమ్స్‌కు వచ్చారు. సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ సందీప్, మత్తు వైద్య నిపుణులు డాక్టర్ కళ్యాణ్ ఆధ్వర్యంలో ఈమెకు పరీక్షలు నిర్వహించి శరీరంలో ఉండాల్సిన 25 గ్రాములు థైరాయిడ్ 750 గ్రాములు ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఈమెకు నాలుగు గంటల పాటు శస్త్రచికిత్స నిర్వహించి కణితిని తొలగించారు. ఈ ఆపరేషన్ అంతా బీఎస్‌కెవై పథకం ద్వారా ఉచితంగా చేసినట్లు జెమ్స్ ఆర్‌ఎంఓలు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, బాలమురళీలు తెలిపారు.

గడ్డి కుప్పలు దగ్ధం

టెక్కలి రూరల్: సంతబొమ్మాళి మండలం మర్రిపాడులో సోమవారం చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన రాంపాత్రుని అగస్తి నాయుడు, ఎస్.లక్ష్మీనారాయణ, ఎస్.రాజారావు అనే రైతులు తమ పశువుల మేత కోసం ఉంచిన నాలుగు గడ్డి కుప్పలు దగ్ధమయ్యాయి. ఈ మేరకు సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. సమీపంలో విద్యుత్ తీగలు ఉండటం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు భావిస్తున్నారు.